# కొండమీద కోవెల

"ఈ పూట రైల్లో పెళ్ళివారు వస్తున్నారు, కారు పంపించు" అని అన్నయ్య హుకుం యిచ్చాడు.

"ఎంతమంది వస్తున్నారు, ఎన్ని కార్లు పంపించాలి" అని అడిగాను. "పట్టినంత మందిని వ్యానులో ఎక్కించు. మిగతా వారిని, నీ కారులో తీసుకురా' అని ఆయన అన్నాడు.

కారు తీసుకుని, స్టేషనుకు వెళ్ళాను. వెళ్ళిన పది నిమిషాలకి రైలు వచ్చింది. పెళ్ళివారు వచ్చారు. అంతా కలసి పదిమంది లేరు. వాను కదిలే వేళకు, ఒక ముసలాయన-

"నాయనా రెండో బండిలో మా అబ్బాయి వస్తాడు. వాణ్ణి తీసుకురా" అని అన్నాడు.

వ్యాను వెళ్ళిపోయింది. నేను మళ్ళీ స్టేషనులోనికి వచ్చాను. రెండో బండి రావటానికి, యింకా గంట వ్యవధివుంది. స్టేషన్‌ప్రక్క కాలువలో, గాలికి వాలుగా తెరచాప పడవ రివ్వునవెళ్ళి పోతూవుంటే, ముసలి సరంగు చుట్ట కాల్చుకుంటూ, చుక్కాని దగ్గర కూర్చొని చూపులు సారించి ఎటో చూస్తుంటే అటు చివర కూర్చున్న కుర్రవాడు

"ఏలూరెళ్ళిందొక చిలుకోయి, దాని ఎర్రకోక మీద నా మనసోయి" అని పాడుతున్నాడు. పడవ నన్నుదాటి వెళ్ళింది. పాట మెల్లిగా దూరమయింది. స్టేషనులో గంటవిని నేను అటు చూచేసరికి, దూరంగా నల్లటిపొగ, పొగవెనుక బుసలు కొడుతున్న రైలుబండి కనిపించింది. కొంత సేపట్లో స్టేషనుకువచ్చి చేరింది. రైలు ఆగి ఆగగానే మళ్ళీ బయలుదేరింది. ఎవరో ఆడపిల్ల రైలుదిగింది. రైలు వెళ్ళిపోయింది. నేనూ తను మిగిలాం.

ఎవరికోసమో స్టేషనంత కలయజూస్తోంది. కొద్ది క్షణాలు గడిచాయి. నాకొక ఆలోచన తట్టింది. నేనే ఆ అమ్మాయి దగ్గరకు వెళ్ళి "ఏమండి, మీరు పెళ్ళివారి తాలూకా?" అని అడిగాను.

"మీరు!" అన్నది.

"ఆడపెళ్ళివారం." ఆ పిల్ల ఏం మాట్లాడలేదు.

"పెళ్ళివారు యిందాక రైల్లో వచ్చారు. వానులో వెళ్ళిపోయారు."

"ఇక్కడనుంచి బస్సు దొరుకుతుందా!" అని అడిగింది.

"మా కారువుంది. దాంట్లో తీసుకువెడతాను" అన్నాను. ఆ మనిషి అక్కడనుంచి కదలలేదు.

"పోనీ వెయిటింగ్ రూమ్‌లో కూర్చోండి" అన్నాను. అప్పటికి ఆ మనిషి కదల్లేదు. నేను ప్లాట్‌ఫారం చివరకువెళ్ళి నిలబడ్డాను. రైలు వచ్చింది. అందులోంచి నేను ఎదురుచూస్తున్న వ్యక్తి దిగాడు. నేను వెళ్ళి పలుకరించేలోపలే, అతను "హల్లో మీనా" అంటూ ఆ పిల్లను పలుకరించాడు.

"నువ్వు వస్తున్నావని తెలుస్తే నేను వచ్చేదాన్నికాను."

అతనిముఖంలో చిరునవ్వు మాయమైంది. "ఎందుకని?" అని అడిగాడు.

"ఎందుకనో నీకే తెలుసు."

"కారు రెడీగావుంది. వెడదామా?" అని నేను అడిగాను.

ఎవరో అన్నట్లు నావంక చూశాడు.

"ఆడపెళ్ళివారం. మీ కోసం కారు తీసుకువచ్చాను" అని అన్నాను.

"కమాన్ మీనా!" అని అతను అన్నాడు.

"నువ్వు వెళ్ళు. నేను బస్సులో వస్తాను" అని తను అన్నది.

"అయితే నేనూ బస్సులో వస్తాను" అని అతనన్నాడు.

"ఒకసారి చెబుతే అర్థంకాదా!" అని తను కోపంగా అన్నది.

"మీరు ఎవరూ బస్సులో వెళ్ళడానికి వీలులేదు. మా కారులో రావలసిందే' అని నేను అన్నాను.

"నేను రాను" అని ఆ పిల్ల అన్నది.

"ఇంకా రెండు మూడుగంటలసేపు దాకా బస్సు దొరకదు, మిమ్మల్ని వదిలి నేను కారులో ఒంటరిగా వెడితే, మావాళ్ళు అపార్థం చేసుకుంటారు. మావాళ్లు బాధపడతారు. దయచేసి, మా కారులో రావలసిందని నా ప్రార్థన" అని నేను అన్నాను.

ఇద్దరు ఒక్కక్షణం మాట్లాడలేదు. కుర్రవాడు వచ్చి ముందుసీట్లో కూర్చున్నాడు. మీనా వెనుకసీట్లో కూర్చుంది. పావుగంటలో సత్రంచేరింది. రావిచెట్టు నీడలో కారునిలిపి నేను వాళ్ళిద్దరిని సత్రంలోకి తీసుకువెళ్ళాను.

రాత్రి పన్నెండు గంటలు దాటింది. కొండమీద కోవెలలో లైట్లు మళ్ళీ ఒక్కసారి వెలిగాయి. మరి కొన్ని క్షణాలలో మంగళ వాయిద్యాలు వినిపించాయి. "నేను వచ్చేదాకా యిక్కడే వుండు" అని హుకుం యిచ్చి, అన్నయ్య కొండమీదకు

ఎక్కాడు. సత్రంలో నేను, ఒక పెట్రోమాక్సు లైటు మిగిలాం. బయట ఎటు చూసినా, పిండారబోసిన వెన్నెల, వెన్నెలలో ఎవరో దూరంగా వెడుతున్నారు. ఎందుకో ఆగారు. మళ్ళీ వెనక్కి తిరిగారు. నేను సత్రంలోకి వెళ్ళాను. ఎవ్వరూ లేరు. అంతా నిశ్శబ్దం. మెల్లిగా ఒక్కొక్క గదిదగ్గరకు వెళ్ళి తాళాలు సరిగ్గా వున్నాయో, లేవో చూడటం మొదలుపెట్టాను. మొగపెళ్ళివారి భాగంలో అన్ని తలుపులకు తాళాలున్నాయి. ఒక్క తలుపుమాత్రం తెరచి ఉంది. ఓరవాకిలిగా తలుపు తెరిచి చూశాను. ఒక్కక్షణం అల్లాగే నిలబడ్డాను. చక్కని పట్టుచీరె కట్టుకున్న పిల్ల ఎవరో మోకాళ్ళమీద తలపెట్టుకొని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

'ఏమండీ!' అని పిలిచాను. ఉలిక్కిపడి నా వంక చూసింది మీనాక్షి.

"మీరా! ఎందుకొచ్చారు?" అని అడిగింది.

"లగ్నానికి అందరు వెళ్ళారు" అని అన్నాను.

"నన్ను పిలుచుకరమ్మన్నారా?" అని అడిగింది.

"అవును."

ఆ అబద్ధం ఎందుకు ఆడానో యీనాటికి కూడా నాకు తెలియదు.

"నాకు తలనొప్పిగా వుంది. నేను రాలేను" అని అన్నది.

"మందు తెచ్చిపెడతాను. వేసుకుని అక్కడికి వెళ్ళండి. ఒంటరిగా కూర్చుంటే భయపడతారు" అని అన్నాను.

"మీరు!" అని అడగబోయింది.

"నేను యిక్కడ వుండను. కొంచెం సేపటిలో వెడతాను" అని అన్నాను.

"నాకేం భయంలేదు. నేను ఒంటరిగా వుండగలను" అని అన్నది.

నేను రెండు ఆస్ప్రోమాత్రలు యిచ్చి బయటకు వచ్చాను. నా కారు దగ్గర నిలబడి ఎవరో సిగరెట్లు కాలుస్తున్నాను. నేను దగ్గరకు వెళ్లాను. ఎవరది అని అడుగుదామని అనుకున్నాను. అవసరం లేకపోయింది. అతను అతనే మధ్యాహ్నం వచ్చిన అతను.

"లగ్నానికి వెళ్ళలేదేం!" అని అడిగాను.

"తలనొప్పిగా ఉంది" అని అనగానే నేను నేను పక్కున నవ్వాను.

"నవ్వుతారేం?" అని కోపంగా అడిగాడు.

'మధ్యాహ్నం మీ యిద్దరికి కోపం వచ్చింది. ఇప్పుడు తలనొప్పి వచ్చింది' అని అన్నాను.

"ఎవరికి?"

"మీలో మధ్యాహ్నం కారులో వచ్చిన వారికి."

"ఎక్కడ వుంది?"

"ఇక్కడే వున్నారు. మందుయిచ్చి యిప్పుడే వస్తున్నాను" అని అన్నాను. అతను నా మాట పూర్తిగా వినిపించుకోలేదు. సరాసరి సత్రంలోకి వెళ్ళాడు. మరుక్షణంలో వడివడిగా ఆ పిల్ల బయటకు వచ్చింది.

"నన్ను కొండమీదకు తీసుకువెళ్ళండి" అన్నది.

అతనుకూడా వెనువెంటనే వచ్చాడు.

"మీనా!" అని పిలిచాడు.

ఆ పిల్ల నాతో 'రండి వెడదాం. ముహూర్తం వేళ అయింది" అని అన్నది.

ఆ పిల్లను కొండమీదదించి క్రిందకు వచ్చారు. అతను కనిపించలేదు. సత్రంలోనూ లేడు. ఏమైనాడా అని చూస్తే కారులో కూర్చుని, సిగరెట్టు కాలుస్తున్నాడు.

తెల్లవారింది. మాయింటి ఆడపిల్ల, మరొకరి యింటి కోడలయింది. అన్నయ్యతోపాటు నిన్న కనిపించిన ముసలాయన కూడా వచ్చాడు.

"అబ్బాయి! మావాడు కనిపించాడా?" అని అడిగాడు.

"రాత్రి తలనొప్పిగా వుందని అక్కడే పడుకున్నారు" అని అన్నాను. పెళ్ళివారు కాఫీల హడావిడిలో వున్నారు. నేను అన్నయ్యతో చెప్పి దైవదర్శనానికని, కొండమీదకు వచ్చాను. ఉత్తరదిక్కు మండపం దగ్గర వాళ్ళిద్దరూ కనిపించారు.

"నామాట విను మీనా?" అని అతనంటున్నాడు.

"వినను! వినను! వినను!" కోపంగా అని ఆ పిల్ల అక్కడనుంచి వెళ్ళిపోయింది.

"మీనాన్నగారు మీకోసం వెతుక్కుంటున్నారు" అని నేను అతనితో అన్నాను.

"సిగరెట్టు వుందా!" అని అతను అడిగాడు.

నేను చిరునవ్వు నవ్వి "ఇది వెంకటేశ్వరస్వామి ఆలయం" అన్నాను.

"ఐయాం సారి!" అని అంటూ అతను అక్కడనుంచి, వెళ్ళిపోయాడు.

మా తరపు చిచింద్రి ఒకడు, నాదగ్గరకు వచ్చి, "పానకంలో పుడక" అని అన్నాడు.

"ఏమిటని" అడిగాను.

"డేగ పావురాయిని తరమటం చూశావా!" అని అడిగాడు.

"శిబి చక్రవర్తి కథలో విన్నాను."

"వాడిలాగా నువ్వుమాత్రం త్రాసులో కూర్చోవద్దు."

"ఈ రోజుల్లో డేగలు, పావురాయిలు మాట్లాడవుగా!" అని అన్నాను.

"మాట్లాడుతాయి కాని వాటిభాష మనకు అర్థం కాదు" అని వాడు అన్నాడు.

"ఇంతకూ వచ్చిన పనేమిటి?"

"టిఫిన్‌కు దయచేయమంటున్నారు. తమరు నిన్నా, యివ్వాళకూడా ఆడపెళ్ళివారే" అని అన్నాడు. ఇద్దరం కలసి విడిదిలోకి వెళ్ళాము. అన్నయ్య నన్ను జూచి,

"అదేపోక పోయావేం! వాళ్ళు ఎక్కడికో వెడతారుట, కారు తీసుకువెళ్ళు' ' అని అన్నాడు.

ఎవరో ముగ్గురు మనుష్యులు కారు దగ్గర వున్నారు. "కామవరపుకోట వెళ్ళివద్దామా?" అని వాళ్ళన్నారు. కారు బయలుదేరే వేళకు వచ్చాడు.

"ఎందాకా?" అని అడిగాడు.

"ఇక్కడికేరా! కోటదాకా! నువ్వుకూడా రా" అని అన్నాడు.

"స్థలం చాలదేమో!" అని మీనాక్షి అన్నది.

"వాడు ముందు కూర్చుంటాడులే. నువ్వు లేకపోతే ఏం సరదా లేదు" అని ఆయన అన్నాడు. అతను వచ్చి నాప్రక్కన కూర్చోగానే,

"గుడ్‌మార్నింగ్" అని అన్నాను.

"గుడ్ మార్నింగ్" అని అతనన్నాడు.

"సంధి కుదిరిందా!" అని అడిగాను.

"ఎవరికి?"

"శత్రువుల మధ్య." అతను కోపంగా నావంక చూశాడు.

"కవిత్వం రాస్తారా!" అని అడిగాడు.

"లేదు కవిత్వం చూస్తాను" అని అన్నాను.

కారు స్టార్టు చేశాను. రెండు అడుగులు నడిచి, అక్కడే ఆగింది. చూస్తే పెట్రోలులేదు. ఆమాట వినేసరికి ముసలాయన, ముసలావిడ, అతను చిరాకు పడ్డారు. కారుదిగి సత్రానికి బయలుదేరారు. ఆ అమ్మాయిమాత్రం ఒక్కక్షణం ఆగి, "థాంక్యూ వెరిమచ్" అని అన్నది.

సాయంకాలం ఏడుగంట లయింది. తొమ్మిది గంటలకు పెళ్ళివారి ప్రయాణం. పెళ్ళివారి వూరు వెడదామని నాకు సరదాకలిగి, ఆ సన్నాహంలో

వున్నాను. ఏడుగంటలవేళ అన్నయ్య నన్ను పిలచి, "అమ్మడుతో నేను వెళ్లి వస్తాను. నువ్వు యింటికివెళ్ళి పనులు చూసుకో" అన్నాడు. నాకు కోపం వచ్చింది. గబగబా కొండమీదకు ఎక్కేను. ఉత్తర మండపంలో మిత్రులిద్దరూ మళ్ళీ కనిపించారు. వాళ్ళని చూడ్డంతోనే రఘువంశంలో మొదటిశ్లోకం జ్ఞాపకం వచ్చింది.

"వాగర్థా వినస్సంపక్తే వాగర్థ ప్రతిపత్తయే
జగతః పితరౌ వందే, పార్వతీ పరమేశ్వరౌ!"

అనుకోకుండానే వాళ్ళకు చేరువగావెళ్ళి చీకటిలో యీ నల్లటి విగ్రహం కనిపించలేదో ఏమో నేను లేనట్టుగానే వాళ్ళు మాట్లాడుకోవటం మొదలుపెట్టారు. నేను కూడా లేనట్టుగానే అక్కడ నిలబడ్డాను. వాళ్ళ పరమ రహస్యాలు విందామని నా ఉద్దేశ్యం కాదు. ఊరికి వెళ్లేముందు, ఒక్కసారి దైవదర్శనం చేసుకువెడదామని నా ఉద్దేశ్యం అంతే.

"నామాట వినకపోతే నామీద ఒట్టు" అని అత నన్నాడు.

"నేను ఎవరిమాట వినను" అని ఆ పిల్ల అన్నది.

"ఎందుకని?"

"నువ్వు చేసిన పనులకు."

"నేనేం చేశాను?"

"ఏం చేశావో తెలియదా?"

"తెలియదు. నువ్వు పెళ్లికి వస్తావని అంతదూరం నుంచి వచ్చాను. నీతో నాలుగు గడియలు సంతోషంగా గడుపుదామని అనుకున్నాను. నన్ను విదిలించి కొడుతున్నావు. నేనేదో నీకు పగవాడనైనట్టు ప్రవర్తిస్తున్నావు. నా మనసు ఎంత బాధపడుతోందో నీకు తెలుసా?"

"బాధ అంటే యిప్పటికైనా అర్థం అయిందా?"

"అర్థమైంది. కాని నేనంటే ఎందుకో నీకు కోపం. నాకు సంగీతంరాదు. నేనేమో సితారు వాయించలేను. నాట్యం చేయలేను... మా నాన్నకేం పెద్దపెద్ద మేడలు లేవు."

"మీనా!"

"బంధుత్వం కంటె నీకు... అయినా ఎందుకులే. నన్ను ఎందుకు చిత్రవధ చేస్తావు."

"మీ నాన్న మా నాన్నకి ఏమని వ్రాశాడో గుర్తుందా?"

"తెలిసింది మీనా... నీతో అన్ని విషయాలూ చెప్పి పోదామని వచ్చాను. నువ్వు వినకపోతే... అది మన యిద్దరి దురదృష్టం."

ఇంకా అబద్ధాలు ఆడతావు దేనికి? సితారు వాయించే పిల్ల నీకు నచ్చిందని మీ నాన్నకు వ్రాశావుటగా.

"నేను చెప్పేది పూర్తిగా విను మీనా!"

"వినవలసింది యిప్పటికే విన్నాను."

"వినలేదు. విన్నానని అనుకుంటున్నావు. ఒక్కమాట విను."

"ఏమిటది?"

"జరిగినదంతా చెబుతున్నాను విను. కలకత్తాలో ఒక స్నేహితుల యింట్లో ఉండేవాడిని. వాళ్ళయింటికి తెలుగువాళ్ళు అనేకమంది వస్తుండేవారు. ఒకరోజున మేమంతా ఒక పార్టీకి వెళ్ళాం. వాళ్ళు నన్ను ఎంతో మర్యాద చేశారు. మా నాన్నగారి పేరు, గోత్రం వగైరాలు అడిగారు. నేను మామూలుగా చెప్పాను. తరువాత వాళ్ళ అమ్మాయి కొంచంసేపు సితారు వాయించింది... నాట్యం చేసింది. చాలా బాగుంది. నాట్యం ఎంతో బాగుంది. ఆ మాటలే వాళ్ళతోను ఆ పిల్లతోను చెప్పాను. ఆ పిల్లదాని మంచితనం గుణగణాలను గురించి నాదగ్గర పొగిడారు. అమ్మాయి ఎల్లా వుంది అని అడిగారు. చాలా బాగుంది, ఇంకా కృషి చేస్తే చాలా గొప్ప విద్వాంసురాలవుతుందని చెప్పాను. వాళ్ళు నన్నపార్థం చేసుకున్నారు. వాళ్ళ పిల్లని గురించి నాన్నకు ఉత్తరం రాశారు. నేను పిల్లని చూసినట్టు, నాకు పిల్ల నచ్చినట్టు కూడా, వాళ్ళు నాన్నకి వ్రాశారు.

నాన్న నన్ను ఛడామడా, చివాట్లువేస్తు నాకు ఉత్తరం వ్రాశారు. మేనరికం విషయం మర్చిపోయావా అని నాకు హెచ్చరిక చేశారు. అప్పటికి పరిస్థితి నాకు గ్రాహ్యమైంది. వెంటనే నీకు ఉత్తరం వ్రాద్దామనుకున్నాను. నాన్నలాగే మామయ్యకూడా నన్ను అపార్థం చేసుకున్నారేమోనని భయపడ్డాను. నాన్నకి ఉత్తరం రాశాను కాని మామయ్య మాత్రం నన్ను క్షమించలేదు. నీలాగా నన్ను అపార్థం చేసుకున్నాడు."

"నీ మాటలు నన్ను నమ్మమంటావా!"

"అబద్ధమాడితే నాకు వచ్చే లాభం ఏమిటి? వాళ్ళ పిల్లని వివాహం చేసుకునే ఉద్దేశ్యం నాకు లేదని, చిన్నప్పుడే మేనరికం నిశ్చయమైందని, పెళ్లిచూపుల నిమిత్తం అయితే వాళ్ళ యింటికి వచ్చేవాడినే కాదని, వాళ్ళకు వ్రాశాను. ఇప్పటికీ నామాట నమ్మవా!"

ఆ పిల్ల ఏం మాట్లాడలేదు. వెక్కి వెక్కి ఏడుస్తోంది. "మీనా ప్లీజ్!!" అని అతను అన్నాడు. ఆ పిల్ల అతనివంక చూచి "నిజమా!" అని అడిగింది.

"నిజమే మీనా!"

ఆ పిల్ల ఏం మాట్లాడలేదు.

"నన్ను క్షమించవూ" అని అడిగాడు.

ఆ పిల్ల ఏమీ మాట్లాడలేదు. అతని చేతిని తన చేతిలోకి తీసుకుంది. ఒక్క క్షణం అతనివంక చూసింది. చెయ్యి వదిలి వడివడిగా, అక్కడనుంచి, వెళ్లిపోయింది.

నేను ముందుకు నడిచాను. మండపం దగ్గర ఆగాను. 'టైమెంతయింది' అని అడిగాను.

అతను ఉలిక్కిపడి "ఎవరు?" అన్నాడు.

నేను "నేనే" అని చెప్పాను.

అతరను గడియారంచూచి "ఎనిమిది అవుతున్నది" అంటూ ఆలయంలోకి నడిచాడు.

దేవుని ఎదుట "మీనా నిన్న కనబడ్డ ముసలాయన, ఆయనభార్య నిలబడి ఉన్నారు. ఇతను దగ్గరకు రాగానే ఆయన "రా! రా! సుబ్బన్న" అని అన్నాడు. సుబ్బన్న దైవానికి నమస్కరించి,

"నాన్న, నీతో ఒకమాట చెప్పాలి" అన్నాడు.

"ఏమిటది" అన్నట్టుగా చూశాడు.

"నేను మీనాక్షిని పెళ్లి చేసుకుంటాను."

ఆయన నవ్వుతో "శుభం" అన్నాడు.

మీనా, సుబ్బన్న ఆ ముసలివాళ్ళకి నమస్కరిస్తుంటే నేను "ఏడుకొండలవాడా, వెంకటరమణా" అని తదేక ధ్యానంలోపడితే బయట కారుహారను వినిపించింది.

అన్నయ్య నాభుజంమీద చెయ్యివేసి మరీ గట్టిగా తపస్సుచెయ్యక దేముడు ప్రత్యక్షమైతే చాలా యిబ్బంది.